ACCION FRATERNA ecology centre
sustainable . human . nature

# ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్, అనంతపురం.

## ఈ మాసపు సమాచారం                ఏప్రిల్, 2009

FOR PRIVATE CIRCULATION ONLY

# అనంతపురం జిల్లాలో 'పంట కరువు'ను అధిగమించడానికి 'కీలకతడు'లే శరణ్యం

రైతు మిత్రులారా !

ఈ మాసంలో అతిముఖ్యమైన విషయాన్ని చర్చించుకోబోతున్నాము. ఒకటి, రెండు వర్షాలు తక్కువపడే సందర్భంలో 20 నుంచి 40 శాతం వరకూ పంటలు నష్టపోతున్న అనుభవం మనకందరికీ ఉంది. ఈ నష్టాలను నివారించుకోవడానికి, పంటల్ని కాపాడుకోవడానికి మనం ఆలోచనలు చేయాలి. మార్గాలు వెతకాలి.

అనంతపురం జిల్లా అంటే వ్యవసాయం మీద ఆధారపడిన జిల్లా. అతి తక్కువ వర్షపాతం జిల్లా. తరచూ కరువులకు గురయ్యే జిల్లా. పంటలు బాగా వస్తాయనకున్న సందర్భాలలో కూడా ఒక్కొక్కసారి పంట పూత దశలో వున్నప్పుడు వరపుతోనూ, (బెట్ట) చివరి రెండు, మూడు వారాలలో పంటకు కావలసిన వర్షము సమయానికి పడక పంటను దెబ్బతీసి రైతుల ఆశలను తలకిందులు చేయగల పరిస్థితులు ఉన్న జిల్లా. 'వాన రాకడా, ప్రాణం పోకడా తెలియదన్న' సామెతతో పాటు, పొలంలో పండేటట్లున్న పంట ఇంటికి చేరుతుందో లేదో తెలియని అసందిగ్ధ పరిస్థితులు కూడా మన రైతులకు అలవాటే. ప్రకృతి సహకరించకున్నా ఏటా దాదాపు 25 లక్షల ఎకరాలు పట్టుదలగా సాగుచేస్తున్న 7 లక్షల రైతు కుటుంబాలలో ఈ ఒడిదుడుకులన్నీ ఒక అంతర్భాగం. అసాధ్యాన్ని సుసాధ్యం చేయగల అద్భుతమైన సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందిన దశలో కూడా అనంత రైతులను ఇప్పటికీ ప్రకృతి దయాధర్మాల మీదనే వదిలివేయడం ప్రభుత్వాల అసమర్థతలకు, వైఫల్యాలకు నిలువెత్తు నిదర్శనం.

## జిల్లాలో వేరుశెనగ పంట ప్రాధాన్యత

అనంతపురం జిల్లాలో వేరుశెనగ పంటే ప్రధాన పంటగా ఎందుకు మారిపోయింది ? వేరుశెనగకు కావలసిన పెట్టుబడులకు రైతులకు తలకుమించిన భారంగా మారినా, వేరే పంటలకు పోకుండా ఒక్క వేరుశెనగనే రైతులు ఎందుకు కోరుకుంటున్నారు ? ఈ ప్రశ్నలకు జవాబులు దొరకాలంటే, జిల్లా రైతులలో పరకాయ ప్రవేశం చెయ్యాలి. జిల్లా బయట నిలబడి అభిప్రాయాల్ని ప్రకటించడం వాస్తవాలకు దూరంలో ఉంటుంది. ఇటీవల కాలంలో వేరుశెనగ పంట విస్తీర్ణం తగ్గించాలని, ఇతర పంటల వైపు, ముఖ్యంగా ఆహార పంటల వైపు రైతులను మళ్ళించాలని వ్యవసాయ అభివృద్ధి మీద పని చేస్తున్న సంస్థలు, వ్యక్తులు కృషి చేస్తున్నారు. అయినా ఇప్పటికీ అనంతపురం జిల్లా వ్యవసాయమంటే వేరుశెనగ పంటే. ఎప్పుడూ వర్షాభావం చేత పంటలు పోగొట్టుకోవడానికి అలవాటు పడ్డ మన రైతాంగానికి, గత సంవత్సరం అతివృష్టి చేత కూడా వేరుశెనగ పంటను పోగొట్టుకున్న అనుభవం కూడా వచ్చింది. మన జిల్లాలోని వాతావరణ పరిస్థితులు, తక్కువ వర్షపాతం, నేలల స్వభావం మాట అటుంచి, అవసరమైన సందర్భాలలో వర్షాలు కురవకపోవడం, 15 రోజుల నుండి 45 రోజుల వరకూ కూడా వరపు ఏర్పడుతుండడంతో రైతులు అధికంగా నష్టపోతున్నారు. మన జిల్లాలో కురుస్తున్న సగటు వర్షపాతం 522 మి.మి. కంటే కొంచెం ఎక్కువగా వర్షపాతం నమోదయిన సంవత్సరాలలో కూడా పంటలు నష్టపోయిన సందర్భాలున్నాయి. సగటుకు కొంచెం తక్కువగా నమోదయిన సంవత్సరాలలో మంచి పంటలు వచ్చిన సందర్భాలూ ఉన్నాయి. దీనిని బట్టి తెలుతున్నదేమంటే కురుస్తున్న వర్షం పంటల కీలక దశల్లో కురిసినపుడు పంటలు పండుతున్నాయి. కీలక దశల్లో వర్షాలు ఎగబెడితే వర్షపాతం మామూలుగా వచ్చినా, ఎక్కువగా నమోదయినా పంటలు నష్టపోవాల్సి వస్తోంది. వేరుశెనగేతర పంటలు పొట్ట దశలో బెట్టకు గురయితే, తరువాత వర్షాలు వచ్చినా, తిరిగి కోలుకోవడం చాలా కష్టం. వేరుశెనగ పంట అలా కాదు. ఒకానొక దశలో 30 రోజులు బెట్టకు గురయి వర్షాలు వస్తే, తిరిగి కోలుకుంటుంది. అంతో ఇంతో పంట ఇస్తుంది. బెట్టకు తట్టుకునే సామర్థ్యం, ఇతర పంటల కంటే అధికంగా వుండి, తిరిగి కోలుకోగల సహజగుణం, పంట పండితే వచ్చే అధిక ఆదాయాల కారణంగానే వేరుశెనగ పంట ప్రాధాన్యత కొనసాగుతోంది. గత సంవత్సరం వర్షాలు ఎక్కువైనా మిగతా పంటలు పండినా, వేరుశెనగ పంట నష్టపోవడంతో మొత్తం వ్యవసాయ ఆదాయమంతా నష్టపోయినట్లయింది. జిల్లాలో వేరుశెనగ పంట పండితే అయిదు వేల కోట్ల విలువైన పంట ఉత్పాదన ఉంటుంది. పంట నష్టమయితే, పన్నెండు వందల నుంచి రెండు వేల కోట్ల పెట్టుబడులు రైతులనెత్తిన పడుతాయి. సాధ్యమయినంత వరకూ వేరుశెనగ పంట విస్తీర్ణం తగ్గించి ఇతరత్రా పంటల విస్తీర్ణం పెంచడానికి మనం ప్రయత్నాలు కొనసాగిస్తూనే, వర్షాభావ పరిస్థితులను, కరువులను అధిగమించే ప్రయత్నాలు కూడా చేయాలి.

## ఒరుపులో కీలక తడులు ఇవ్వగలగాలి

జిల్లాలో చాలామటుకు భూములు ఎత్తు పల్లాలతో నిండి ఉన్నాయి. వర్షాభావం ఏర్పడినపుడు ఒకే రైతు పొలంలోనే పై భాగం పంట ముందుగా వాడుకు గురువుతుంది. దిగువన ఇంకా తేమ ఉంటుంది కాబట్టి వెనుకగా వాడుపడుతుంది. అలాగే ఒక గ్రామంలోని ఎగువన ఉన్న పొలాలు తొందరగా బెట్టకు గురయి పైర్లు వాడుపడితే, దిగువన ఉండే పొలాలు నిదానంగా వాడుకు వస్తాయి. ఈ వ్యత్యాసాలు పంట దిగుబడుల మీద ప్రభావం చూపిస్తున్నాయి. ఒక రైతుకు పండిన పంట సరళిలోనే పక్క రైతు పంట పండదు. వర్షాధారం కింద వేసిన వేరుశెనగ పంట బెట్టకు గురయినపుడు నీటి వసతిగల రైతులు కొందరు పైపులు, స్ప్రింక్లర్ల ద్వారా ఒకటి, రెండు తడులు ఇచ్చి పంటలు →

**చిట్కా :** బియ్యం కడుగులో ధనియాలను నూరి పటిక బెల్లంతో కలిపి చిన్న చిన్న దోసులలో ఆ మిశ్రమాన్ని రోజుకు రెండుసార్లు చిన్న పిల్లలకు ఇస్తే, వారికి దగ్గు ఆయాసం తగ్గుతాయి. ఒక ఔన్సు ధనియాల కషాయం సేవించి బస్సు ఎక్కితే ప్రయాణంలో వాంతులు వచ్చేవారికి వాంతులు రావు.

"భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్ధిల్లుతూనే ఉంటుంది" ఉపనిషత్తులు

ఒడుపు కోవడంలో సఫలీకృతులైన రైతులను గమనించడం జరిగింది.

నిజానికి ఈ వ్యాసం ద్వారా నేను ప్రతిపాదిస్తున్న ప్రత్యామ్నాయ మార్గాలకు స్ఫూర్తి వారే. నీటి వసతిగల రైతులకు మాత్రమే కాకుండా అవసరమైన రైతులందరికీ ఈ సదుపాయం సమకూర్చాలి. వేరుశెనగ పంట పూత వచ్చిన తరువాత ఊడలు దిగేటప్పుడు 15 రోజులకొకమారు పదును వర్షాలు అవసరం. 3-4 వర్షాలు సకాలంలో కురిస్తే పంట బయటపడుతుంది. వర్షపాతం వల్ల వచ్చే వర్షాలకు తోడు బెట్ట పరిస్థితులు ఏర్పడినపుడు కీలకమైన దశలో ఒకటి లేదా అవసరాన్ని బట్టి రెండు తడులు 20 మి.మీ. వరకైనా ఇవ్వగలిగితే పంట నష్టాన్ని పూర్తిగా నివారించవచ్చును. ఇటువంటి కీలక తడులవల్ల జిల్లా మొత్తంగా రెండు నుంచీ, మూడు వేల కోట్ల వరకూ పంట నష్టాన్ని నివారించగలమంటే అతిశయోక్తి కాదు. ఈ కీలక తడి లేదంటే మొత్తం వేల, లక్షల ఎకరాలలో పంట ఎండిపోతుంది. ఇటువంటి కీలక తడుల ద్వారా ప్రాంతీయ సమన్యాయంతో పాటు, సామాజిక న్యాయం కూడా జరుగుతుంది. ఎలాగంటే వర్షాధారం మీద ఆధారపడి వ్యవసాయం చేసే రైతులు అధికంగా బీద రైతులు, దళితులు గిరిజనులు, ఇతర వెనుక బడిన వర్గాలవారు. వీరందరికీ సమన్యాయం జరుగుతుంది.

## ఇందుకు ఏం చెయ్యాలి ?

ఇపుడు బావులద్వారా నీటి వసతి సౌకర్యం ఏర్పాటు చేసుకున్న రైతులందరి వద్ద దాదాపుగా స్ప్రింక్లర్లు ఉన్నాయి. ప్రభుత్వం కూడా 50 శాతం నుండి 90 శాతం వరకూ సబ్సిడీతో స్ప్రింక్లర్ల సెట్లను రైతులకు అందజేస్తోంది. ట్రాక్టరు లేదా లారీల మీద నీటి ట్యాంకులు పెట్టుకుని (సింటెక్స్ డ్రమ్ములు విస్తారంగా దొరుకుతున్నాయి) స్ప్రింక్లర్ల సెట్టు అమర్చుకొని వాడుపట్టే దశలో 15 మి.మి. నుండి 20 మి.మి. తడి ఇచ్చే ప్రయత్నం చేయాలి. దగ్గరలోని చెరువులు, బావులు, కాలువల నుంచి నీటిని తెచ్చుకోవాల్సి ఉంటుంది. కొన్ని గ్రామాలలో నీరు దొరకడం కూడా సమస్యగా ఉంటుంది. అయితే, నీటిపారుదల సౌకర్యం ఉన్న రైతులతో ఏదో ఒక విధంగా మాటాడి వారి ద్వారా నీటిని పొందే ప్రయత్నాలు చేయాలి. ఇది మనకు అలవాటులేనిది కాబట్టి సమస్యాత్మకంగా అనిపించవచ్చు. కానీ పంటనష్టాన్ని నివారించుకోగలమనుకున్నప్పుడు, ఈ శ్రమ లెక్కలోకి రాదు. ఇది తక్షణం రైతుల స్థాయిలో చేసుకోగల సౌకర్యం.

నీటి వసతి లేని రైతులకు ప్రభుత్వ స్ప్రింక్లర్లు పొందే అవకాశం లేదు. దీని కోసం ప్రభుత్వం నిబంధనలు సడలించాలి. బావులు, బోర్లు లేని రైతులకు కూడా స్ప్రింక్లర్లు 90 శాతం రాయితీతో రైతులకు సరఫరా చేయాలి. చాలా మంది రైతులు ట్రాక్టర్ల బాడుగలు పెట్టుకునే ఆర్థిక పరిస్థితులు లేవు కాబట్టి ప్రభుత్వమే పూనుకుని ట్యాంకర్ల ద్వారా సామూహికంగా రైతులకు ఉచితంగా నీరు అందించే ఏర్పాట్లు చేయాలి. లేదా నామమాత్రపు ఫీజుతో రైతులకు ట్రాక్టర్లు, స్ప్రింక్లర్లు అందుబాటులో ఉంచాలి. రైతుల పంటలు కరువుబారిన పడకుండా రక్షించాల్సిన బాధ్యతను ప్రభుత్వం స్వీకరించాలి. జిల్లాలో వేరుశెనగకు 2000 సంవత్సరంలో మొవ్వకుళ్ళు రోగం వచ్చినపుడు యుద్ధ ప్రాతిపదికన రైతులకు 4 కోట్ల రూపాయల విలువైన రసాయనిక పురుగు మందులు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన విషయం అందరికీ గుర్తుండే ఉంటుంది. దాని వలన పంటలేమి కాపాడుకోలేకపోయినా కానీ, విలువైన రైతుల ప్రాణాలు మాత్రం కోల్పోయాం. ఒరుపుకు తట్టుకునే విధంగా కీలక తడులు కల్పించడానికి ప్రతి సంవత్సరం 20 నుంచి 30 కోట్ల నిధులు ప్రభుత్వం కేటాయించాలి. దీని ద్వారా వేల కోట్ల రూపాయల విలువైన పంటలను కాపాడుకోవచ్చును. ప్రభుత్వం దీని కోసం పూనుకోవాలి.

ఏ పథకమైనా, ఏ కార్యక్రమమైనా ప్రభుత్వం నుండి రావాలంటే అంత సులభం కాదు. కనుక ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూడకుండా రైతులు తమ స్థాయిలోనే పూనుకోవాలి. చాలా మంది రైతులు అయిదు ఎకరాలలోపు వారే కాబట్టి, వారు ఒక టైరు బండిమీద సింటెక్స్ డబ్బాలుగానీ, డ్రమ్ములుగానీ బండి మీద పెట్టుకొని ఈ ప్రయోగం చేయవచ్చును.

## స్థానిక నీటి వనరులను అభివృద్ధి పర్చాలి.

మనకు నీటి లభ్యతే కీలక సమస్య. కొన్ని కొన్ని గ్రామాలలో డ్రమ్ము నీరు కావాలన్నా మైళ్ళ దూరం ప్రయాణించాల్సి వస్తుంది. అరకొర నీటి వసతుల కారణంగా బోర్ల నుండి కూడా నీరు ఇవ్వరు. ఈ దుస్థితికంతటికీ కారణం మనం స్థానిక నీటి వనరులను నిర్లక్ష్యం చేయడమే. ఈ జిల్లాలో కురుస్తున్న అత్యల్ప వర్షాపాతం, వరుస కరువులను తట్టుకొని ప్రజలు జీవించడానికి గతంలో పాలకులు అవకాశమున్న చోటల్లా చెరువులు, కుంటలు, తలిపెరలు, ఊటకాలువలు నిర్మించారు. పూర్తి ఎండాకాలంలో కూడా వీటిలో నీరు దొరికే సౌలభ్యం ఉండేది. ఇటువంటి జిల్లాలో అయిదు వేలకు పైబడి ఉన్నట్లు ఒక అంచనా. ఇపుడు ఆ పరిస్థితులు లేవు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో పాటు, చాలా చోట్ల ప్రజలే వాటిని నష్టపరుస్తున్నారు. పూడిపోయిన లేదా పాడైపోయిన ఇలాంటి చిన్న నీటి వనరులన్నింటినీ ప్రభుత్వం పునరుద్ధరించాలి. ప్రజల ఉపయోగంలోకి తేవాలి. పెద్ద ఆయకట్లు తప్ప, మిగతా చిన్న చిన్న చెరువులు కుంటలను ఊట చెరువులుగా మార్చాలి. నీటి నిలువ ఉండేలా చర్యలు తీసుకోవాలి. బయటి ప్రాంతం నీటితో కాలువల ద్వారా చెరువులు నింపగలగాలి.

## ఉపరితల నదీ జాలలను జిల్లాలో నిలువ చేయాలి.

మన ప్రభుత్వాలు అమలుపరుస్తున్న నీటి వినియోగ విధానమే చాలా లోపభూయిష్టంగా ఉంది. అందువల్లే కోస్తా జిల్లాల్లో సంవత్సరానికి మూడు పంటలు పండితే, మనకు పది సంవత్సరాలలో మూడు పంటలు పండుతాయి. ఇరాన్ నుండి పెట్రోలు, డీజలు వేల మైళ్ళ ఎత్తు పల్లాలను అధిగమించి మన రాష్ట్రానికి తీసుకువచ్చి కావలసినంత కోస్తా తీర ప్రాంతానికి అందించినట్లే, రాయలసీమ ప్రాంతానికి కూడా అందిస్తున్నారు. అందుకు ఏ భూగోళ పరిస్థితులు అడ్డు రావడంలేదు. మరి నీటి పంపిణీకి ఈ భూగోళ పరిస్థితులు, ఎత్తు పల్లాలు ఎందుకు అడ్డం పడుతున్నాయో నాయకులకే తెలియాలి. జిల్లాలోనికి హంద్రీనీవా ద్వారా అదనపు నీరు వస్తాయంటున్నారు. ఇవి అన్నీ వరద నీటి మీద ఆధారపడినట్టివి కనుక, నీటి లభ్యతలో నమ్మకం లేదు కనుక సాధ్యమయినంత వరకూ చెరువులలోనూ, జిల్లాలో వున్న ఇతర రిజర్వాయర్లలో నిలువ ఉంచాలి. నీటిని నిల్వ చేయడానికి అవసరమైన ఇంకా కొన్ని ప్రాంతాలలో కొత్త రిజర్వాయర్లను నిర్మించాలి. దీని ద్వారా ఏ ప్రాంతానికి అయినా తాగునీటికైనా, ఉన్నటువంటి పంటలు కాపాడుకోవడానికి అయినా ఈ నీటిని ఉపయోగించవచ్చును. ఈ రకంగా నీటి వనరుల లభ్యత అందుబాటులో ఉంటే, జిల్లాలో పచ్చదనపు వాతావరణాన్ని అభివృద్ధి చేయవచ్చును. పంటలను కాపాడుకోవచ్చును.

మీ శ్రేయోభిలాషి,

**డా॥ వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు – ఎకాలజి సెంటరు**

(4వ పేజీ తరువాయి)

రైతులు ఏ మాత్రం పంట ఉత్పత్తులు గావించినారు అన్న దానికంటే, ఆ ఉత్పత్తులతో రైతులకు ఏ మాత్రం ఆదాయం లభిస్తోందని, ఆ రైతు ఆదాయం తన కుటుంబ సభ్యుల అవసరాలు తీరుస్తుందా లేదా అన్న దానిమీదనే ఆలోచించాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులకు స్థిరమైన ఆదాయం వచ్చేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవలసిన అవసరం వుంది. చిన్న, సన్న కారు రైతులకు, వ్యవసాయ కూలీలకు స్థిరమైన ఆదాయం అందించాలి. ఇందుకోసం ప్రభుత్వం "రైతు ఆదాయ కమీషన్" ఏర్పాటు చేసి స్థిర ఆదాయాన్ని అందించే విధి విధానాలను రూపొందించాలి. ఇందులో భాగంగా వర్షాధార రైతులకు సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్న చిన్న సన్నకారు రైతులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి ఎకరానికి 3000 రూపాయలు తగ్గకుండా ఆర్థిక సహాయం చేయాలి.

ఈ సందర్భంగా అన్నీ రాజకీయ పార్టీలకు, ప్రభుత్వాలకు, విధాన నిర్ణేతలకు వ్యవసాయ శాస్త్రవేత్తలకు మేము చేస్తున్న ఈ క్రింది డిమాండ్లను పరిశీలించి, విధాన నిర్ణయాలలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నాము. ఈ ఎన్నికల తరుణంలో రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికలలో సేంద్రీయ వ్యవసాయాభివృద్ధికి చోటు కల్పించాలి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన అనివార్యంగా సుస్థిర వ్యవసాయ విధానాలను అమలుచేయాలని ఈ క్రింది ప్రతిపాదనలను డిమాండ్స్‌గా రాజకీయ పార్టీలముందుకు తెస్తున్నాము.

## మౌలిక సదుపాయాలు :

- అనంతపురం జిల్లాను సేంద్రీయ వ్యవసాయ జిల్లాగా ప్రభుత్వం ప్రకటించాలి.
- సేంద్రీయ వ్యవసాయ ఎరువుల ఉత్పత్తి కొరకు దేశీయ పశువులు మరియు చిన్న జీవాలను రాయితీలతో రైతులకు అందించి, దేశవాళి పశుపోషణను ప్రోత్సహించాలి.
- ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా చెరువుల మట్టిని చిన్న సన్నకారు రైతు పొలాలకు ప్రభుత్వమే ఉచితంగా తోలించి, భూమిని సారవంతం చేయాలి.
- గ్రామ పరిసరాల్లోని బంజరు భూములు, వంకలు, వాగులు, చెరువుల పై భాగంలోను మరియు వ్యవసాయ భూముల గట్ల మీద విరివిగా పచ్చిరొట్టను మరియు పశుగ్రాసాన్ని ఇచ్చే చెట్లను పూర్తి ప్రభుత్వ ఖర్చులతో పెంపొందించి సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి.
- పూర్తి స్థాయి నీటి వినియోగం కొరకు వ్యవసాయంలో ప్రభుత్వం వందశాతం రాయితీలతో బిందు మరియు తుంపర నీటి యాజమాన్య పద్ధతులను ప్రోత్సహించాలి.
- సేంద్రీయ వ్యవసాయదారులకు బయోగ్యాస్ ప్లాంట్స్‌ను నూటికి నూరుపాళ్ళు రాయితీలతో ప్రభుత్వమే ఏర్పాటుచేయాలి.
- చిన్న నీటి వనరులను కాపాడి, వాటిని పునరుద్ధరించడంలో ప్రభుత్వమే పూర్తి బాధ్యతవహించి, ప్రజల యాజమాన్యం ద్వారా సుస్థిరం చేయాలి.
- వ్యవసాయ పనిముట్లు ప్రభుత్వ రాయితీలతో అందుబాటులో వుంచి, నిరంతరం అందించాలి.

## సేంద్రీయ ఉత్పత్తులు మరియు మార్కెట్ సదుపాయాలు :

- సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులకు ప్రత్యేక మార్కెట్ సదుపాయం అన్ని స్థాయిలలో కల్పించాలి.
- సేంద్రీయ వ్యవసాయం ద్వారా పండించిన అన్ని వ్యవసాయం ఉత్పత్తులకు మద్దతు ధర ప్రకటించి, ప్రోత్సహించాలి.
- ప్రజలందరికి పౌష్టికాహారం అందుబాటులో వుండే విధంగా మెట్ట రైతులు పండించే సజ్జ, జొన్న, రాగిలాంటి ఆహార పంటల్ని ప్రభుత్వ రైతుల నుండి నేరుగా కొనుగోలుచేసి, బియ్యం సరఫరాలోరాయితీ ఇస్తున్నట్లుగా చౌక ధాన్యపు డిపోల ద్వారా రాయితీతో ప్రజలకు పంపిణీ చేయాలి.
- పాడిపశువులను మరియు వ్యవసాయానికి ఉపయోగపడే పశుసంపదను కబేళాలకు తరలించకుండా ప్రభుత్వమే బాధ్యత వహించి, నిలిపివేయాలి.
- యన్.పి.యం. కొరకు అవసరమైన వివిధ కషాయాలు, సేంద్రీయ పురుగు మందుల షాపులను నడుపుటకు ప్రభుత్వం రాయితీలనిచ్చి ప్రోత్సహించాలి.
- సేంద్రీయ ఉత్పత్తులకు అనుకూలంగా అన్ని మండల స్థాయిలలో సీతల గిడ్డంగులు ప్రభుత్వమే ఏర్పాటు చేసి, రైతు భాగస్వామ్యంతో నిర్వహించాలి.

## సేంద్రీయ వ్యవసాయ విస్తరణ :

- పార్థీనియం కలుపుమొక్కను యుద్ధ ప్రాతిపదికన నాశనం చేసి, వ్యవసాయ భూములను ప్రభుత్వమే కాపాడాలి.
- సేంద్రీయ వ్యవసాయం చేసే చిన్న సన్న కారు రైతులకు ఎకరానికి రూ॥ 3000 తగ్గకుండా ప్రతి ఏట వ్యవసాయ రాయితీ కింద అందించి, ప్రోత్సహించాలి.
- అనంతపురం జిల్లాలో ఆర్గానిక్ అగ్రికల్చర్ యూనివర్శిటీ (సేంద్రీయ వ్యవసాయ విశ్వవిద్యాలయం)ని స్థాపించి, సేంద్రీయ వ్యవసాయంపై పరిశోధన మరియు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తూ పరిశోధనా ఫలాలను రైతులకు అందచేయాలి.
- సేంద్రీయ వ్యవసాయంపై ఒక ప్రత్యేక కమీషన్‌ని నియమించి, కమీషన్ చేసిన సిఫారస్సులను తూ.చా. తప్పక ప్రణాళికాబద్ధంగా అమలుపరచాలి.
- సేంద్రీయ వ్యవసాయం చేసే చిన్న సన్న కారు రైతులకు ఉపాధి పథకం ద్వారా వందరోజుల పనిని వ్యవసాయపు పనులకు అందించి, ప్రోత్సహించాలి.
- సేంద్రీయ వ్యవసాయ పద్ధతులద్వారా పండ్లతోటలను పెంపొందించే రైతులకు మొక్కలు పెట్టినప్పటి నుండి ఐదు సంవత్సరములు అనగా పంట చేతికొచ్చే వరకు అన్ని ఖర్చులలో రాయితీలనిచ్చి, ప్రభుత్వం ప్రోత్సహించాలి.
- సేంద్రీయ ఎరువుల తయారీ యూనిట్లను గ్రామ స్థాయిలో ప్రభుత్వం రాయితీలనిచ్చి ప్రోత్సహించాలి.
- అన్ని పంచాయితీ స్థాయిలలో రైతులద్వారా విత్తన ఉత్పత్తి మరియు విత్తన నిధిని ప్రభుత్వమే ఏర్పాటు చేసి, రాయితీలతో ప్రోత్సహించాలి.
- సేంద్రీయ వ్యవసాయం చేసే మహిళా రైతులకు అత్యధిక రాయితీలనిచ్చి ప్రోత్సహించాలి.

## సేంద్రీయ వ్యవసాయ సంఘాలు మరియు నెట్‌వర్కింగ్ :

- గ్రామ స్థాయిలో సేంద్రీయ వ్యవసాయం సంఘాలను ఏర్పాటు చేసి, బలోపేతం చేయాలి.
- మండలం, జిల్లా మరియు స్టేట్ స్థాయి సేంద్రియ వ్యవసాయ సంఘాల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వమే చొరవతీసుకొని సహాయ సహకారాలు అందించి ప్రోత్సహించాలి.

# సుస్థిర వ్యవసాయ పద్ధతుల్లో....

## రైతులలో స్ఫూర్తినిచ్చిన సుస్థిర వ్యవసాయ సభ

అనంతపురం లలితకళా పరిషత్‌లో సుస్థిర వ్యవసాయం మీద 6-3-2009న సదస్సు జరిగింది. జిల్లాలో సేంద్రీయ వ్యవసాయం పద్ధతులను ఆచరిస్తున్న రైతులు, రైతు మహిళలు పాల్గొన్నారు. సుస్థిర వ్యవసాయమే నేటి వ్యవసాయ సంక్షోభానికి సమాధానం అంటూ ఎలుగెత్తి చాటిన ఈ సభ అనంత స్వచ్ఛంద సంస్థల సుస్థిర వ్యవసాయ ప్రోత్సాహ వేదిక, అనంత సుస్థిర వ్యవసాయదారుల వేదిక ఆధ్వర్యంలో జరిగింది. సుస్థిర వ్యవసాయ కేంద్రం, హైదరాబాదు వారి సౌజన్యంతో సభ నిర్వహించబడింది. శ్రీమతి హొసూరమ్మ ప్రార్థనా గీతముతో సభ ప్రారంభమయింది.

సభకు అధ్యక్షత వహించిన ఎకాలజీ డైరెక్టరు మల్లారెడ్డిగారు సభను ప్రారంభిస్తూ, మెట్ట వ్యవసాయం సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. వ్యవసాయదారుల చేతుల్లో ఉండాల్సిన వ్యవసాయం వ్యాపారుల చేతుల్లోకి వెళ్లింది. విత్తనం, ఎరువులు, రోగాలు, పురుగుమందులు అన్నీ వ్యాపారమయమై పోయినాయి. ఫలితంగా వ్యవసాయమే సంక్షోభంలో చిక్కుకుంది. ఈ రోజు మన నేల కలుషితమైంది. నీళ్ళు కలుషితమయినాయి. పంటలు కలుషితమైనాయి. మనం తినే తిండి కలుషితమైంది. పశువులు, పక్షులు తీవ్రమైన కలుషిత వాతావరణంలో బతుకుతూ తమ సహజ ధర్మాల్ని కూడా మరచిపోయే స్థితికి చేరుకున్నాయన్నారు. ఈ పరిస్థితులలో మనం తిరిగి వ్యవసాయాన్ని రైతుల చేతుల్లోకి తీసుకురావాలి. మన వ్యవసాయం మన చేతుల్లోకి తీసుకోవడానికి ప్రభుత్వం నుండి ఎలాంటి ప్రోత్సహకాలు రావాలి ? ఏ విధంగా సహాయం తీసుకోవాలి ? లాంటి విషయాలన్నీ ఈ సదస్సు చర్చిస్తుందన్నారు. రసాయనిక ఎరువులకు సబ్సిడీల రూపేణా ప్రభుత్వం నీటి పారుదల వసతి ఉన్న రైతులకు ఏటా 90 వేల కోట్ల రూపాయలు అందిస్తున్న ప్రభుత్వం, రసాయనిక ఎరువులమీద ఆధారపడకుండా సేంద్రీయ ఎరువులు తయారు చేసుకుంటున్నవారికి ఏ విధమైన రాయితీలు ఇవ్వకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. ఇపుడు ఎన్నికల సందర్భం కాబట్టి రాజకీయ పార్టీలు వారి వారి ఎన్నికల ప్రణాళికలలో మెట్ట వ్యవసాయం చేసుకునే రైతులకు ఏమి వాగ్దానాలు చేస్తారో అడగాల్సి ఉంటుందని చెప్పారు.

సభకు ముఖ్య అతిథిగా హాజరైన డా॥ నమ్మల్వార్ మాట్లాడారు. డా॥ నమ్మల్వార్‌ది తమిళనాడులోని తంజావూరు దగ్గర చిన్న గ్రామం. దాదాపు 85 సంవత్సరాల వయసున్న నమ్మల్వార్ ఎంతో ఉత్సాహంగా సభలో పాల్గొనడమే కాకుండా సేంద్రీయ వ్యవసాయంలో తన అనుభవాలు వివరించారు. ఆయన ప్రభుత్వ ఆధ్వర్యంలోని వ్యవసాయ పరిశోధనా స్థానంలో పరిశోధకుడుగా పనిచేస్తూ, తన స్వంత వ్యవసాయ క్షేత్రంలో రకరకాల రసాయనిక ఎరువులు వాడడం జరిగింది. తాను చదువుకున్న వ్యవసాయ శాస్త్రం రైతులకు, వ్యవసాయదారులకు వ్యతిరేకమైందని తెలుసుకుని ఉద్యోగంలో ఇమడలేక రాజీనామా చేశారు. సుస్థిర వ్యవసాయ పద్ధతులతో రైతులతో కలిసి వ్యవసాయం చేస్తూ తన అనుభవాల్ని ఇతర రైతులతో పంచుకుంటున్నారు.

నమ్మల్వార్‌గారు మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను చర్చించడానికి ఇంత పెద్ద ఎత్తున రైతులు, రైతు మహిళలు కదిలిరావడం తనకు ఎంతో సంతోషాన్నిస్తున్నదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని రైతుల, స్వచ్ఛంద సంస్థలు తనకు పరిచయమున్నవారేనన్నారు. చాలాసార్లుగా ఈ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను సందర్శించాను. స్వచ్ఛంద సంస్థలు, రైతులు పరస్పర సహకారంతో కలసి సుస్థిర వ్యవసాయ పద్ధతులమీద పనిచేయడం ఎంతో సంతోషయదాయకం. ఈ రోజు మనల్ని రెండు ప్రధాన సమస్యలు పీడిస్తున్నాయి. ఒకటి భూగోళం వేడెక్కడం, రెండు ఆహార భద్రత లేకపోవడం. వ్యవసాయానికి సంబంధించి మన సాంప్రదాయక విజ్ఞానం పరిపూర్ణమైనటువంటిది. మనం ఇతర దేశాలను అనుకరించాల్సిన అవసరం లేదన్నారు. మనం పండించే పంటలలో పైభాగం మనుషులకు, మధ్య భాగం పశువులకు, కింది భాగం భూమికి ఉపయోగపడాలి. భూమాత ఆరోగ్యంగా ఉంటే, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అదిమనకు అందిస్తుంది. ఆరోగ్యమైన ఆహార పదార్థాలనందించే సుస్థిర వ్యవసాయం అని అన్నారు. శ్రీమతి జయమ్మ, కేకుంట్లపల్లి, ఎన్.వి. నారాయణ, శ్రీమతి లింగమ్మ, మల్లాపురం తదితరలు రైతులు రైతు మహిళలు,సేంద్రీయ వ్యవసాయంలో తమ అనుభవాల్ని వివరించారు. సదస్సు ఈ క్రింది డిమాండ్లను ఆమోదించింది.

### అన్ని రాజకీయ పార్టీలకు సభ విజ్ఞప్తి

భారతదేశంలో తీవ్ర వ్యవసాయ సంక్షోభాల జిల్లాలుగా గుర్తించిన 32 జిల్లాలలో 16 జిల్లాలు మన రాష్ట్రంలో వుండగా అందులో అనంతపురం జిల్లా ఒకటి. అనంతపురం జిల్లా కేవలం సంక్షోభంతోనే కాదు ; తీవ్రమైన వరుస కరువుల జిల్లాగా పేరుగాంచింది. నీటి పారుదల వనరులు లేక ఉపాధి కల్పించే పరిశ్రమలూ లేక మొత్తం 80 శాతం జనాభా మెట్ట వ్యవసాయం మీదనే ఆధారపడుతున్నది. కరువులతో పంటలు పోయిన సంవత్సరాలే కాకుండా పంటలు పండిన సంవత్సరం కూడా పెరిగిన వ్యవసాయ పెట్టుబడులు రైతులను తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయి. శ్రమకు సైతం ఫలితం దక్కని మెట్ట వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించడం ఒక్కటే తక్షణ కర్తవ్యం. ఈ నేపథ్యంలో పంటలకు తెగుళ్ళను, రైతులకు ఆత్మహత్యలను ప్రసాదిస్తున్న రసాయనిక ఎరువులు, రసాయనిక పురుగు మందుల స్థానంలో సేంద్రీయ వ్యవసాయమొక్కటే ఈ జిల్లా రైతులను సమస్యలను తగ్గిస్తుదని భావిస్తూ వున్నాయి. అయితే సేంద్రీయ వ్యవసాయానికి కావలసిన మౌళిక వనరులైన అడవులు, చెట్లు, చిన్ననీటి వనరులు, పశుసంపదలు అన్ని క్షీణించి పోయినాయి. వీటిని తిరిగి అభివృద్ధి చేసుకోవాలి. ప్రభుత్వం దీనికి పూనుకోవాలి. ఒకే పంట వేస్తూ జిల్లా రైతాంగమంతా ఒకేసారి నష్టపోయే ఏక పంట విధాన స్థానంలో, బహుళ జాతిపంటలు, ఆహార ధాన్యాల పంటలు అభివృద్ధిచేసుకోవలసి వుంది.

ఈ పరిస్థితులలో సుస్థిర వ్యవసాయ పద్ధతులను ఆచరిస్తూ, ప్రోత్సహిస్తూ, చిన్న సన్నకారు వ్యవసాయదారుల వ్యవసాయంపైనే సమాజం ఆహార భద్రత ఆధారపడివుందని నమ్మే "సుస్థిర వ్యవసాయదారుల సమాఖ్య" రైతుల సంక్షేమం కోసం ఈ క్రింది చర్యల చేపట్టవలసిందిగా రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేస్తోంది.

ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త డా॥ స్వామినాథంగారు మెట్ట వ్యవసాయ రైతుల ఆదాయ మార్గాలు పెంపొందించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

(మిగతా 3వ పేజీలో)

ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.

☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990, E-mail : actionf@sancharnet.in
actionf_atp@dataone.in